క్లుప్తంగా

తిమ్మరాజుపేటలో జాబ్‌మేళా

మునగపాక: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే విజయకుమార్ అన్నారు. తిమ్మరాజుపేటలోని డావెన్సీ అంతర్జాతీయ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి మూడు నెలలకు జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. జీతంతో పని లేకుండా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డావెన్సీ స్కూల్ డైరెక్టర్ రమణాజీ, కూటమి నేతలు రాజాన రమేష్‌కుమార్, జనపరెడ్డి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి



ఈ-పంట నమోదు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

మునగపాక: ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు కోరారు. మండలంలోని వాడ్రాపల్లిలో అమలవుతున్న ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వలే కాకుండా పంటల సాగుతో పాటు బీడు, పాకల వివరాలు కూడా ఈ-పంట నమోదులో పొందుపరుస్తామన్నారు. ఈ-పంట నమోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వం ద్వారా వచ్చే సాయం అందుతుందన్నారు. మండల వ్యవసాయాధికారి సీహెచ్.జ్యోత్స్నకుమారి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న పరిరక్షణ ప్రతినిధి లోవరాజు

పాయకరావుపేట: విద్యార్థులు, యువత కూడా సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా బాలల పరిరక్షణ ప్రతినిధి లోవరాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని స్త్రీశక్తి భవన్‌లో విద్యార్థులతో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సైబర్ క్రైమ్, పోక్సో యాక్ట్, బాలల అక్రమ రవాణా, బాలల హక్కులు, బాల్య వివాహాలు తదితర అంశాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు పూర్తి స్థాయిలో చదువుపై దృష్టి సారించి ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఏపీఎం శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ లలిత, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

గవర్ల అనకాపల్లిలో హుండీ చోరీ

మునగపాక: మండలంలోని గవర్ల అనకాపల్లిలో శుక్రవారం అర్ధరాత్రి హుండీ చోరీకి గురైంది. గ్రామంలోని మెయిన్ రోడ్డును ఆనుకొని శ్రీకృష్ణాలయం ఉంది. ఆలయ ప్రాంగణంలో హుండీ ఉండేది. శుక్రవారం రాత్రి వరకు కనిపించిన హుండీ శనివారం తెల్లవారు చూసేసరికి కనిపించలేదు. దీంతో ఆలయ నిర్వాహకులు హుండీ చోరీకి గురైందని నిర్ధారించుకున్నారు.

మరిడిమాంబ ఆలయ నిర్మాణానికి విరాళాలు



మరిడిమాంబ అమ్మవారికి విరాళం అందజేస్తున్న భక్తులు

మునగపాక: మండలంలోని తోటాడ త్రిమూర్తుల ఆలయ సమీపంలో తలపెట్టిన మరిడిమాంబ అమ్మవారి ఆలయ నిర్మాణానికి దాతలు తమవంతు సాయం అందజేస్తున్నారు. గవర్ల అనకాపల్లికి చెందిన చదరం ఈశ్వరరావు, వరలక్ష్మి దంపతుల కుమారులు శేఖర్, ప్రశాంత్, కళ్యాణ్‌లు శనివారం రూ.70,116 నగదును విరాళంగా అందజేశారు. దొడ్డి జక్కన్న కుమారుడు రమణ 20,116 నగదు, దొడ్డి వీరునాయుడు కుమారుడు శివ 10,116 నగదును విరాళంగా అందజేశారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు, వార్డు సభ్యులు రాపేటి పరమేశ్వరరావు, మళ్ల మహాలక్ష్మినాయుడు, బుద్ధ రవిశంకర్, బొడ్డేడ శ్రీనివాసరావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

యూరియా కోసం.. హైరానా

- వర్షాలతో ఊపందుకున్న వరిసాగు
- 646 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం
- ఇప్పటి వరకు 421 మెట్రిక్ టన్నుల సరఫరా
- కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు



మునగపాకలో వరి ఉడుపుల కోసం దమ్ము చేసిన పొలం



మునగపాకలో ఎదుగుదలకు నోచుకోని చెరకు తోట

మునగపాక: ఇటీవల కురిసిన వర్షాలకు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమైన రైతులను యూరియా కొరత వేధిస్తోంది. అవసరమైన యూరియాను సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందంటూ సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. మునగపాక మండల వ్యాప్తంగా ఇటీవల కురిసిన వర్షాలతో రైతులు వరి సాగుకు ఉపక్రమిస్తున్నారు. నాట్లు వేసిన పొలాలతో పాటు ఇతర పంటల సాగుకు యూరియా ఆవశ్యకత ఉంది. సకాలంలో ఎరువులు అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి అవసరం మేర యూరియా లేక రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. రెండు రోజుల్లోగా యూరియాను అందుబాటులోకి తీసుకురాకుంటే రైతులు ఆందోళనలకు సిద్ధమవుతున్నారు.

వైఎస్ జగన్ హయాంలో పుష్కలంగా యూరియా

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఎరువులు పుష్కలంగా లభించేవి. సీజన్‌కు ముందుగానే ఎరువులు, విత్తనాలను సరఫరా చేసి రైతులు ఇబ్బంది పడకుండా చేశారు. ఎంత విస్తీర్ణంలో పంటల సాగు జరుగుతుంది.. ఎంత మేర యూరియా కావాల్సి ఉంటుందో ముందుగానే ప్రణాళికలు రూపొందించి అందుకు తగ్గట్టుగా సరఫరా చేసేవారు. గతేడాది అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతులకు అవసరమైన యూరియాను పూర్తి స్థాయిలో సరఫరా చేయకుండా చేతులెత్తేస్తుందంటూ రైతులు వాపోతున్నారు. ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు

ఒకవైపు ముమ్మరంగా వరి నాట్లు పనులు జరుగుతున్నాయి. దమ్ము సమయంలో యూరియా చాలా అవసరం. చెరకుతో పాటు ఇతర పంటల సాగుకు కూడా యూరియా అవసరం లేకపోలేదు. ఈ నేపథ్యంలో యూరియా కోసం రైతులు నానా హైరానా పడుతున్నారు. స్థానిక పీఏసీఎస్‌లతో పాటు రైతు సేవా కేంద్రాలకు రైతులు పరుగులు తీస్తున్నారు. తీరా వెళ్లాక నిరాశతో వెనుదిరుగుతున్న పరిస్థితులు నెలకొన్నాయి.

646 మెట్రిక్ టన్నుల యూరియా లక్ష్యం

మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 646 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం. ఇంతవరకు 421 మెట్రిక్ టన్నుల మేర యూరియాను సరఫరా చేశారు. ఇంకా 225 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంది. యూరియా కొరత కారణంగా రైతులకు అందించలేకపోతున్నారు. 3,897 హెక్టార్ల మేర పలు రకాల పంటల సాగు జరుగుతుంది. ఈ పంటలకు అనుగుణంగా యూరియా అందించాల్సి ఉంది. ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో యూరియా కొరత ఏర్పడింది.

ఎరువుల కోసం ఆందోళన

మునగపాక: ఎరువుల అమ్మకాలు చేపట్టి రైతులను ఆదుకోవాలని రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. మునగపాక పీఏసీఎస్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ఆయన శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ ప్రారంభమైనా రైతులకు అవసరమైన యూరియాను సకాలంలో ఎందుకు సరఫరా చేయడం లేదన్నారు. యూరియా అందుబాటులో లేక రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ నిరాశతో వెనుతిరుగుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. అరకొరగా యూరియా అందించి చేతులు దులుపుకొంటున్నారని మండిపడ్డారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రైవేటు వ్యక్తుల నుంచి అధిక ధరకు యూరియాను కొనుగోలు చేయాల్సి వస్తుందన్నారు. రైతులకు తక్షణమే యూరియా అందించకుంటే సోమవారం వ్యవసాయ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ ఎస్.బ్రహ్మాజీ, రైతులు బొడ్డేడ మునిలి నాగ అప్పారావు, పెంటకోట సాయి, ఆడారి యుగంధర్, నడిశెట్టి రమణ, ఆడారి గోవింద, దాడి సూరిబాబు, వెలగా సూరప్పారావు, విల్లూరి త్రినాథ, దొడ్డి నూకరాజు పాల్గొన్నారు.

కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం



పంటల సాగుకు అవసరమైన యూరియా అందుబాటులో లేదు. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా యూరియా దొరకడం లేదు. అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో యూరియా సమస్య వచ్చింది. ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలి.

– నరాలశెట్టి సూర్యనారాయణ, రైతు, ఒంపోలు

రెండు రోజుల్లో సమస్య పరిష్కారం



రైతులకు అవసరమైన ఎరువులను ఇప్పటికే అందుబాటులోకి తీసుకువచ్చాం. 646 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా.. ఇప్పటి వరకు 421 మెట్రిక్ టన్నుల మేర యూరియాను సరఫరా చేశాం. ఒక్కసారిగా ఖరీఫ్ పనులు ఊపందుకోవడంతో రైతులు యూరియా కోసం ఎదురుచూస్తున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లాం. రెండు రోజుల్లోగా సమస్య పరిష్కారమవుతుంది.

– సీహెచ్.జ్యోత్స్నకుమారి, మండల వ్యవసాయాధికారి

నకిలీ ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు



కోటవురట్లలో ఎరువుల స్టాక్‌ను తనిఖీ చేస్తున్న ప్రత్యేకాధికారి శోభారాణి

కోటవురట్ల: నకిలీ ఎరువులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని మండల ప్రత్యేకాధికారి శోభారాణి హెచ్చరించారు. మండలంలోని ఎరువుల దుకాణాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల నాణ్యత, స్టాక్, ఎలక్ట్రానిక్ కాటాల బరువు, రిజిస్టర్లు పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన రేట్లకే ఎరువులను విక్రయించాలన్నారు. ఎరువుల ధరల పట్టిక కచ్చితంగా ఉండాలని, తూకంలో తేడా వచ్చినా, నకిలీ ఎరువులను విక్రయించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, పురుగుల మందులకు సంబంధించి రశీదు కచ్చితంగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, తహసీల్దారు తిరుమలబాబు, ఏవో సరోజిని, ఎస్ఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మూడు గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ'

మునగపాక: మండలంలోని ఒంపోలు, అరబుపాలెం, తిమ్మరాజుపేట గ్రామాల్లో ఆదివారం బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి పార్టీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ హాజరు కానున్నారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

స్త్రీ నిధి రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

- డీఆర్‌డీఏ పీడీ శచీదేవి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శచీదేవి

నక్కపల్లి: మండలంలో డ్వాక్రా మహిళలు తీసుకున్న స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి సూచించారు. శనివారం ఆమె ఐకేపీ కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య సభ్యులు, డ్వాక్రా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, సీఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి తక్కువ వడ్డీకి స్త్రీనిధి ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. మహిళలు పాడి పశువుల పెంపకం ద్వారా ఉపాధి పొందవచ్చన్నారు. మహిళలు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. జీవనోపాధి అభివృద్ధి ప్రణాళికలో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు తుని పశువుల సంతలో గేదెలు, ఆవులు కొనుగోలు చేసి డ్వాక్రా సంఘాలకు అందజేయాలని నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అనంతలక్ష్మి, కార్యదర్శి మాధుని, సీసీలు పాల్గొన్నారు.

నేవల్ బేస్ ప్రభావిత గ్రామాలకు న్యాయం చేయాలి

- బాబు మోసాలు ఇంటింటికీ వివరిద్దాం..
- వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త ధర్మశ్రీ



బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ సమావేశంలో మాట్లాడుతున్న కరణం ధర్మశ్రీ

రాంబిల్లి: నేవల్ బేస్ రాకతో మత్స్యకార గ్రామాల్లో ఉపాధి అవకాశాలు లేకపోవడం, గ్రామాల తరలింపు తర్వాత పంపిణీ చేయాల్సిన పరిహారం, ప్యాకేజీ విషయంలో జరిగిన అన్యాయంపై పోరాడతామని వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. రాంబిల్లి మండలంలోని కప్పుగొండుపాలెం, చినకలవలాపల్లి, కొత్తపేట గ్రామాల్లో శనివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ రచ్చబండ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ప్యాకేజీ ప్రకటించినా పంపిణీ చెయ్యకపోవడం, ఉపాధినిచ్చే చెరువులను తమ ఆధీనంలోకి తీసుకునేందుకు నేవల్ బేస్ ప్రయత్నించడం సమంజసం కాదన్నారు. కొత్తపేట సైతం ప్రభావిత గ్రామంగా ఉన్నప్పటికీ ఎటువంటి పరిహారం ఇవ్వకుండా ఈ ప్రాంతాన్ని వెనుకబాటుకు గురిచేయడం, మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు తగ్గినప్పటికీ ప్రత్యామ్నాయాలు చూపకపోవడం అన్యాయమన్నారు. వైఎస్సార్ సీపీ తరపున మత్స్యకారులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. హామీలను విస్మరించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యేనని ఎద్దేవా చేశారు. అమలు సాధ్యం కాని హామీలు ఇవ్వడం, గెలిచాక ప్రజల్ని మోసం చేయడం బాబుకి అలవాటేనని, పిల్లనిచ్చిన మామను సైతం వెన్నుపోటు పొడిచిన ఆ నేత ప్రజల్ని వెన్నుపోటు పొడవడా..? అని ప్రశ్నించారు. అయినప్పటికీ తమ అధినేత జగన్ నాయకత్వంలో ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడతామని తెలిపారు. చంద్రబాబు మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరించేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ఎంపీపీ గొట్టుముక్కల శిరీష శ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, పార్టీ మండల అధ్యక్షుడు పిన్నమరాజు కిశోర్ రాజు, గొట్టుముక్కల గిరిరాజు, నెట్టెం సత్యనారాయణ, కొవిరి రామకృష్ణ, కప్పుగొండుపాలెం సర్పంచ్ హరిబాబు, తాతబాబు, నూకరాజు, అప్పలరెడ్డి, దేవుడు, అరుణలత, జగన్, యూత్ వింగ్ అధ్యక్షుడు వెంకీ, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం



కోనంపాలెంలో హెచ్ఐవిపై ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం: హెచ్ఐవీ, టీబీ, సుఖ వ్యాధుల పట్ల ప్రజల్లో చైతన్యం పెరగాలని చైల్డ్ ఫర్ లింక్ వర్కర్స్ స్కీమ్ డీఆర్‌పీ గోవిందరావు తెలిపారు. అచ్యుతాపురం మండలం కోనంపాలెంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 12 నుంచి సెప్టెంబర్ 12 వరకూ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణా సంస్థ ఆధ్వర్యంలో 'మీకు తెలుసా' కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 1097 హెల్ప్‌లైన్ ద్వారా ఇటువంటి వ్యాధుల గురించి తెలుసుకోవచ్చునన్నారు. ఏఎన్ఎం అనిత, ఎల్ఎంహెచ్‌పీ కల్యాణి, ఆశా వర్కర్ పద్మ, వేణి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు



మన్యంపాలెంలో మొక్క నాటుతున్న న్యాయమూర్తి రమేష్

యలమంచిలి రూరల్: ఆడ, మగ పిల్లల్లో బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు ఉన్నాయని యలమంచిలి అడిషినల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కె.రమేష్ అన్నారు. శనివారం యలమంచిలి మండలంలో ఏకైక గిరిజన గ్రామమైన మన్యంపాలెంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, పౌర హక్కులపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాల కారణంగా ముందుగా చదువుకు దూరమౌతారన్నారు. బాల్య వివాహాలు చేసుకున్న యువతీ యువకుల్లో అనారోగ్య సమస్యలు, వారికి పుట్టే పిల్లలు కూడా సంపూర్ణ ఆరోగ్యంగా లేకపోవడం వంటి నష్టాలు ఉంటాయన్నారు. బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టడానికి సమాజంలో అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించే వారికి చట్ట ప్రకారం శిక్షలు ఉంటాయన్నారు. అదేవిధంగా అంటరానితనం పూర్తిగా నిర్మూలించాలన్నారు. అంటరానితనానికి పాల్పడితే మొదటిసారి 6 నెలలు జైలుశిక్ష, జరిమానా, రెండోసారి పాల్పడితే ఏడాది జైలుశిక్ష, జరిమానా ఉంటాయన్నారు. అనంతరం అధికారులు, గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వరహాలు, రేగుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుగుణ, డీటీ వినయ్‌కుమార్, ఏజీపీ డి.వెంకట్రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.సత్యనారాయణ, కార్యదర్శి ఎల్వీ రామకృష్ణారావు, పేనల్ లాయర్లు .హరిశంకర్రావు, టి.నూకరాజు, రెవెన్యూ, పోలీసు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు



శ్రీరాంపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



నక్కపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

నక్కపల్లి: రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని, దీనిలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో సీతారామరాజు కోరారు. శనివారం మండలంలో పలు గ్రామాల్లో సాస్ ప్రత్యేక డ్రైవ్‌ను పురస్కరించుకుని పారిశుధ్య కార్యక్రమాలు, ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. ఇళ్ల ముందు, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయరాదన్నారు. ప్రత్యేకంగా అందజేసిన డబ్బాల్లోనే వేయాలన్నారు. తడిపొడి చెత్తలను వేర్వేరుగా వేయాలన్నారు. వీటిని సంపద తయారీ కేంద్రాలకు తరలించి అక్కడ వర్మీకంపోస్టు తయారు చేయాలన్నారు. నక్కపల్లిలో సచివాలయం, మండల పరిషత్ కార్యాలయంతోపాటు, పలు వీధుల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిబ్బందితో సాస్ ప్రతిజ్ఞ చేయించారు.

పాయకరావుపేట: స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శ్రీరాంపురంలో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.జయప్రకాష్‌రావు, గ్రామ సచివాలయ కార్యదర్శి వైవీ సత్యనారాయణ, ఎంపీహెచ్‌వో రమణ, సచివాలయ సిబ్బంది, పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సీఆర్‌సీఎఫ్‌వీ స్థల పరిశీలన



సీఆర్‌సీఎఫ్‌వీ స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా మత్స్యశాఖ అధికారి విజయ

పాయకరావుపేట: మండలంలోని పెంటకోట గ్రామంలో సిలియన్స్ కోస్టల్ ఫిషర్‌మెన్ విలేజ్(సీఆర్‌సీఎఫ్‌వీ) పథకం భవన నిర్మాణ స్థలాన్ని జిల్లా మత్స్యశాఖ అధికారి జి.విజయ శనివారం పరిశీలించారు. తీర ప్రాంత మత్స్యకారులకు తుపాను షెల్టర్ భవనం, కమ్యూనిటీ భవనం నిర్మాణాలకు స్థల పరిశీలన చేశామని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి శృతి తెలిపారు. ఆదివారం ఈ భవనాల నిర్మాణానికి రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత శంకుస్థాపన చేయనున్నారన్నారు.

జి.కోడూరు క్వారీని రద్దు చేయాలి

నర్సీపట్నం:మాకవరపాలెం మండలం, జి.కోడూరు క్వారీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, బాధిత దళిత రైతులు ఆర్డీవో కార్యాలయం వద్ద నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఈ దీక్షకు సీపీఎం మద్దతు తెలియజేసింది. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అడిగర్ల రాజు మాట్లాడుతూ 32 రోజులుగా ఆర్డీవో కార్యాలయం వద్ద దళితులు ఆందోళన చేస్తున్న, ఆర్డీవో బాధితులతో మాట్లాడి సమస్యను పరిష్కరించలేదన్నారు. బాధితుల ఆందోళన పట్ల ఆర్డీవో, మైనింగ్ అధికారులు ఇప్పటికైనా స్పందించాలన్నారు. ఆల్ ఇండియా బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి బొట్టా నాగరాజు, చిరంజీవి పాల్గొన్నారు.

ఉపాధిపై దెబ్బ.. ఆటో కార్మికుల ర్యాలీ



అచ్యుతాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో కార్మికులు

అచ్యుతాపురం: ఉచిత బస్సు పథకం వల్ల నష్టపోతున్న ఆటో కార్మికుల్ని ఆదుకోవాలంటూ అచ్యుతాపురం ఆటో డ్రైవర్లు శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. చదువుకొని ఉద్యోగాలు రాని ఎందరో యువకులు ఇప్పుడు ఆటోలు నడుపుకొంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారని యూనియన్ తెలిపారు. ఉచిత బస్సు రావడం వల్ల ఆటో కార్మికుల ఉపాధికి దెబ్బతగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో కార్మికులకు వాహన మిత్ర ద్వారా రూ.25వేలు భృతి ఇవ్వాలని కోరారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని, ఆటో కొనుగోలుకు రూ.5 లక్షల రుణాన్ని ఎటువంటి వడ్డీ లేకుండా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొండకర్ల ఆటో స్టాండ్ నాయకులు సంతోష్, దమ్ము చండి, రాజునాయుడు, శ్రీను, పైడికొండ, ప్రవీణ్, రమణ, సీఐటీయూ నాయకులు ఆర్.రాము, కూండ్రపు సోమునాయుడు, అచ్యుతాపురం యువశక్తి, చోడమాంబిక యూనియన్, మరిడిమాంబ ఆటో యూనియన్, జగన్నాథపురం ఆటో యూనియన్, యల్లారమ్మ ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

మాకవరపాలెం: సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి వైద్య సిబ్బందిని ఆదేశించారు. మాకవరపాలెం పీహెచ్‌సీని ఆమె శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్‌రూంతోపాటు వ్యాక్సిన్ రూంలను పరిశీలించారు. వైద్యాధికారులు సీతారామలక్ష్మి, శ్రీనివాసరావుతో సమీక్ష నిర్వహించారు. సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. జ్వరాలు అధికంగా ఉండే గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఉపమాకలో కణ్ణినుణ్ శిరుత్తాంబు పారాయణం



పారాయణ చేస్తున్న భక్తులు

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం కణ్ణినుణ్ శిరుత్తాంబు పారాయణం 12 వేల సార్లు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం ఆదివారం సాయంత్రం వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమై, ఒంటి గంటకు తదియారాధన, తిరిగి 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పారాయణ కొనసాగింది. వేంకటేశ్వర స్వామివారి మధుర కవి ఆళ్వార్‌లు, స్వామివారి నమ్మాళ్వార్‌లు మీద అనుగ్రహించిన కణ్ణినుణ్ శిరుత్తాంబు దివ్యప్రబంధము 12 వేల సార్లు పారాయణ చేయడం మన భాగ్యంగా భావించాలని నిర్వాహకులు తెలిపారు.